క్లుప్తంగా

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి



కంకిపాడు: శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని గన్నవరం డీఎస్పీ జయసూర్య అన్నారు. కంకిపాడు పోలీసుస్టేషన్‌లో ఆదివారం రాత్రి వార్షిక తనిఖీ నిర్వహించారు. కార్యాలయ రికార్డులను పరిశీలించారు. కేసుల నమోదు, దర్యాప్తు, పరిష్కారంపై సమీక్షించారు. జయసూర్య మాట్లాడుతూ కేసుల నమోదు, దర్యాప్తు నిష్పక్షపాతంగా సాగాలన్నారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందేలా చూడాలన్నారు. నేరాలను పూర్తి స్థాయిలో నిరోధించటంలో ప్రజా భాగస్వామ్యం అవసరమని తెలిపారు. అందుకు ప్రజల్లో అవగాహన కల్పించే చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ వీ.శ్రీనివాసరావు, ఎస్‌ఐ కె.సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపారాలను అలవర్చుకోవాలి

కంకిపాడు: విద్యార్థులు వ్యాపార దృక్పథాన్ని పెంపొందించుకోవాలని ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్ ప్రిన్సిపాల్ జె.పద్మావతి సూచించారు. స్థానిక పాఠశాల ప్రాంగణంలో ఫెట్ వేడుకలు సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రత్యేకంగా స్టాల్స్‌ను ఏర్పాటు చేసి వస్తు విక్రయాలు జరిపారు. ఫెట్‌ను ప్రిన్సిపాల్ పద్మావతి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ చదువుతో పాటుగా ఆసక్తి ఉన్న అన్ని రంగాల్లోనూ ప్రావీణ్యం పొందాలన్నారు. నైపుణ్యాలను వృద్ధి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులను తీర్చిదిద్దేలా, ప్రగతి సాధించేలా కృషి చేస్తున్నామన్నారు.

ఉయ్యూరు నుంచి శ్రీవైష్ణవి దర్శిని సర్వీసులు

ఉయ్యూరు: ఉయ్యూరు ఆర్టీసీ డిపో నుంచి శ్రీ వైష్ణవి దర్శిని సర్వీసులు అందుబాటులోకి తెచ్చామని డిపో మేనేజర్ ప్రసాద్ తెలిపారు. విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన తెల్లవారుజాము 3 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. ద్వారకా తిరుమల, వాడపల్లి, అన్నవరం, ఆలయాలను దర్శించుకునేలా సర్వీసు ఉంటుందన్నారు. అల్ట్రా డీలక్స్ బస్సు చార్జీ రూ.850 అన్నారు. ఒకే గ్రామంలో 35 మంది భక్తులు శ్రీ వైష్ణవి దర్శనానికి వెళ్లాలనుకుంటే ఆ గ్రామం నుంచే బస్సు బయలుదేరే అవకాశం ఉందన్నారు. వివరాలకు 99493 71625, 95059 91194 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎస్టీయూ వజ్రోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



కంకిపాడు: ఉపాధ్యాయులకు అండగా నిలుస్తానని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. నియోజకవర్గంలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ప్రతినిధులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే పార్థసారథి చేతులమీదుగా నూతన సంవత్సర క్యాలెండరు ఆవిష్కరింపచేశారు. అనంతరం 75 సంవత్సరాల వజ్రోత్సవ వాల్ పోస్టరును ఆవిష్కరించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మండవ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పీకా ఇమ్మానుయేలు మాట్లాడుతూ సంఘం వజ్రోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అక్కినేని సత్యవంతు, పాలడుగు వెంకట కృష్ణమోహన్, జిల్లా కార్యదర్శి ఇంటూరి నాగేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్ అళహరి శ్రీనివాసమూర్తి, పెనమలూరు, కంకిపాడు మండలాల అధ్యక్షులు యు.టైటస్‌పాల్, పచ్చిగళ్ల సురేష్‌బాబు, మండల ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కాలిక్, నాయకులు పి.సాంబశివరావు, పీడీ ప్రసాదరావు, సీహెచ్ రఘుబాబు, ఎస్.స్వరూపరాజు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా ఎంపికైన నవీన్‌కు సన్మానం



మోపిదేవి: కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించనప్పటికీ స్వయంకృషితో అనుకొన్న లక్ష్యాన్ని సాధించిన గోవాడ నవీన్ నేటి యువతకు స్ఫూర్తిగా నిలిచారని గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి తెలిపారు. మండల కేంద్రం మోపిదేవి దళితవాడకు చెందిన నవీన్ ఇటీవల ఏపీపీఎస్సీ ప్రకటించిన ఫలితాల్లో ఎస్‌ఐగా ఎంపికయ్యారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం కేక్ కట్‌చేసి ఎస్‌ఐగా ఎంపికైన నవీన్‌ను సన్మానించారు. నందిగం అభిషేకరావు, వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు లింగం జగదీష్‌కుమార్, నందిగం శ్రీనివాసరావు, కర్లపూడి ఆదిశేషు, ఇస్మాయిల్, బాబూరావు, రవి పాల్గొన్నారు.

ఉత్సాహంగా..ఉల్లాసంగా..



గన్నవరంలో కేక్ కట్‌చేస్తున్న డీఎస్పీ జయసూర్య



హనుమాన్‌జంక్షన్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నేతలు



వీరవల్లిలో కేక్ కట్ చేస్తున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు

నూతన సంవత్సర వేడుకలు

కంకిపాడు: నూతన సంవత్సర వేడుకలను అంతటా ఉత్సాహంగా ఉల్లాసంగా జరుపుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలు దాటాక 2024 సంవత్సరానికి స్వాగతం చెబుతూ ఊరూవాడా అంతా సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి వేడుకలు జరిపారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సోమవారం ఉదయం యువత, మహిళలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్ల ముంగిట రంగులతో అందమైన రంగవల్లులు తీర్చిదిద్దారు. కంకిపాడు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మిని ఎంపీడీఓ పి.అనూష, మండలంలోని పలు శాఖల అధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కంకిపాడులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం, జెడ్పీటీసీ బాకీ బాబు నివాసం వద్ద నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు బాకీ బాబును మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గన్నవరంలో...

గన్నవరం: నియోజకవర్గ వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనగాని రవిని పలు శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు కలుసుకుని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పలు ఉపాధ్యాయ సంఘాల క్యాలెండర్లను, డైరీలను ఎంపీపీ ఆవిష్కరించారు. ఎంపీడీఓ ఈ సత్యకుమార్, ఈఓపీఆర్డీ పి. వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు. స్థానిక కాపు ఐక్య సమ్మేళనం కార్యాలయంలో నూతన సంవత్సర కేక్‌ను వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య కట్‌చేశారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో వేర్వురుగా జరిగిన వాకర్స్ అసోసియేషన్, గుడ్‌మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ వేడుకల్లో పలువురికి అవార్డులు ప్రధానం చేశారు. స్థానిక ఆర్‌సీఎం బాలయేసు దేవాలయంలో పాదర్ పసల థామస్ నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సీఎస్‌ఐ టౌన్ చర్చిలో సంఘకాపరి బండి జీవమనోహర్ నూతన సంవత్సర కేక్‌కు కట్‌చేశారు.

కేక్‌ల పంపిణీ

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో చర్చిలకు అనగాని చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ అనగాని సురేష్ నూతన సంవత్సర కేక్‌లను సోమవారం పంపిణీ చేశారు. నందమూరు, మధిరపాడు, ఇందుపల్లి, మానికొండ, చికినాల, బొకినాల గ్రామాల్లోని చర్చిలకు కేక్‌లు పంపిణీ చేశారు. ట్రస్ట్ చేస్తున్న సేవలను పలువురు వక్తలు ప్రశంసించారు.



గన్నవరం చర్చిలో కేక్ కట్ చేస్తున్న జీవమనోహర్

దుప్పట్లు పంపిణీ

ఉంగుటూరు: మండలంలో పలు గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పలువురు నూతన వస్త్రాలను ధరించి నూతన సంవత్సరం అంతా మంచి జరగాలని దేవాలయాల్లో, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు తేలప్రోలు, గన్నవరం, రామవరప్పాడు, బెంజ్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో రహదారి పక్కన పడుకుని ఉన్న నిరుపేదలకు దుప్పట్లు, ఫ్రూట్స్ పంచి పెట్టారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ రాంబ్రహ్మం, ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్ అభినందించారు.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు మురాళ రాజు, పతంగి శివ, వీరంకి జగదీష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణామిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో..

హనుమాన్‌జంక్షన్ రూరల్: కృష్ణామిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు బాపులపాడు మండలం వీరవల్లిలోని ప్రాజెక్టు కామధేను ఆవరణలో సోమవారం ఘనంగా జరిగాయి. యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు కేక్ కట్ చేశారు. పాల సొసైటీ అధ్యక్షుడు, పాడి రైతులు, కృష్ణా మిల్క్ యూనియన్ సిబ్బందికి ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ కొల్లి ఈశ్వరబాబు, పాలకవర్గ సభ్యులు శనగల వెంకట శివజ్యోతి, బొట్టు రామచంద్రరావు, ప్లాంట్ మేనేజర్ సరిత, హనుమాన్ జంక్షన్ క్లస్టర్ మేనేజర్ కిలారి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నూతన సంవత్సరం రాష్ట్ర ప్రజలకు సంక్షేమ నామ సంవత్సరం కావాలని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సక్కా గాంధీ ఆకాంక్షించారు. విజయవాడ రోడ్డులోని వైఎస్సార్ సీపీ మండల కార్యాయలంలో నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన న్యూ ఇయర్ కేక్‌ను గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు చేతుల మీదగా కట్ చేశారు. పరస్పరం స్వీట్లు పంచుకుంటూ కార్యకర్తలు ఆనందోత్సవాలను జరుపుకున్నారు. ఎంపీపీ యర్రగొర్ల నగేష్, గన్నవరం ఏఎంసీ డైరెక్టర్ పసుపులేటి మురళీ, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్‌మూర్తి, రంగన్నగూడెం పీఏసీఎస్ మాజీ చైర్మన్ కసుకుర్తి శ్రీనివాసరావు, వీరవల్లి ఎంపీటీసీ సభ్యురాలు దూసరి నిర్మల పాల్గొన్నారు.

గన్నవరం రూరల్ : మండలంలోని గ్రామాల్లో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పెద్దలను, గురువులను కలుస్తూ వారి ఆశీస్సులు పొందారు. పాఠశాలల్లో విద్యార్థులు కేక్‌లు కట్ చేసి ఆనందోత్సాహాలు చాటారు. వీరపనేనిగూడెం గణేష్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలు ధరించి వేడుకలను జరుపుకున్నారు. కేకును కట్ చేసి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పంచారు. ప్రిన్సిపాల్ ఆనంద్ సాగర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయాల్లో, గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో నూతన సంవత్సర సంతోషం వెల్లివిరిసింది.

సబ్ డివిజన్ కార్యాలయంలో..

గన్నవరం: స్థానిక రాయ్‌నగర్‌లోని పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆర్‌జీ. జయసూర్యను కలిసిన సబ్ డివిజన్ పరిధిలోని గన్నవరం, పెనమలూరు, కంకిపాడు, హనుమన్‌జంక్షన్ సర్కిల్స్‌కు చెందిన లా అండ్ అర్డర్, ట్రాఫిక్ విభాగాల సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అధికారులతో కలిసి డీఎస్పీ నూతన సంవత్సర కేక్‌ను కట్‌చేశారు. అధికారులు, సిబ్బందికి అల్పాహార విందు ఇచ్చారు. సీఐలు పి.కనకరావు, ఏ. నవీన్ నరసింహమూర్తి, వీ.శ్రీనివాసరావు. టీవీవీ రామారావు, పలువురు ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.



కేక్ అందజేస్తున్న అనగాని సురేష్



వీరపనేనిగూడెంలో కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు



దుప్పటి అందజేస్తున్న ఉషారామ విద్యార్థులు



గన్నవరంలో కేక్ కట్‌చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో



జెడ్పీటీసీ బాబుకు శుభాకాంక్షలు చెబుతున్న ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు



ఎంపీపీ రాజ్యలక్ష్మికి శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీడీఓ అనూష, అధికారులు

171 పెన్షన్లు మంజూరు

గన్నవరం రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పారదర్శకంగా పెన్షన్‌లు మంజూరు చేస్తుందని ఎంపీడీవో ఇ.సత్యకుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 21 గ్రామాల్లో ప్రభుత్వం కొత్తగా అర్హులైన 171 మందికి వివిధ రకాల పెన్షన్లు మంజూరు చేసిందని చెప్పారు. వీటిని మంగళవారం ప్రజా ప్రతినిధులు పంపిణీ చేస్తారన్నారు. రూ.5.60 లక్షలు కొత్త లబ్ధిదారులకు ప్రభుత్వం పెన్షన్లు అందజేసిందని చెప్పారు. అర్హత ప్రామాణికంగా ప్రభుత్వం పెన్షన్‌లు మంజూరయ్యాయన్నారు.

రిక్షా కార్మికులకు సాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్రవంతి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రిక్షా కార్మికులకు చేయూతను అందించారు. స్థానిక విజయవాడరోడ్డులోని ట్రస్ట్ కార్యాలయంలో 60 మంది కార్మికులకు రిక్షా టైర్లు, ఉపకరణాలు పంపిణీ చేశారు. పలువురు పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, డైరెక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

మహా మందిరంలో ప్రత్యేక పూజలు



నున్న(విజయవాడ రూరల్): యోగీశ్వర్ దేవీ దయాళ్ మహా మందిరంలో మందిర్ గురూజీ అమిత్ దేవ్ జీ దక్షిణాది రాష్ట్ర ప్రధాన కార్యాలయం నున్నలో ఉచిత యోగా, జ్యోతిష్యసేవలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారత పర్యటనలో భాగంగా యోగా అభ్యాస్ ఆశ్రమ ట్రస్ట్ సమాజహితం కోసం ప్రత్యేక అష్టోత్తర హోమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఆలయంలో బంగారు శివలింగం (కలశం) ఉందని, దానికి ప్రతి ప్రతిరోజూ సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేయడంతో పాటు భక్తులను కూడా స్వయంగా అభిషేకం చేసేందుకు అనుమతిస్తామన్నారు. నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా నిర్వహించిన హోమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. తొలుత రామ్‌లాల్‌జీ, ముల్కరాజ్ భగవాన్, యోగీశ్వర్ దేవిదయాల్ మహాదేవ్, స్వామి సురేంద్ర దేవ్‌జీ మహారాజ్‌లకు ప్రత్యేక పూజలు చేశారు. ఫిబ్రవరి 14వ తేదీ వసంత పంచమి వరకు యోగా, జ్యోతిష్య ఉచిత సేవలు, అష్టోత్తర హోమం, కొనసాగుతుందని, అదే రోజు గ్రామంలో శోభయాత్ర నిర్వహిస్తామన్నారు. వెండి పళ్లెంలో రామజన్మభూమి అక్షింతలు వేసి కొందరు భక్తులు పాల్గొన్నారు. ఆ అక్షింతలను భక్తులందరికీ పంపిణీ చేశారు. మాజీ సర్పంచి యర్కారెడ్డి శివకుమారి, యోగాచార్య పోలారెడ్డి నాగిరెడ్డి, గుంటక భాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఇంటింటికీ తాగునీరు

- రూ.60 లక్షలు జల్‌జీవన్ మిషన్ నిధులు
- ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్
- చకచకా జరుగుతున్న పనులు

పాతపాడు(విజయవాడరూరల్): మూడు గ్రామాల్లో దీర్ఘకాలంగా ఉన్న తాగునీటి సమస్య త్వరలో తీరబోతోంది. ఇందుకు సంబంధించిన పనులు చకచకా సాగుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.60 లక్షలతో పాతపాడు గ్రామ శివారు సీతారామపురం, వెంకటాపురం, అప్పారావుపేట గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తోంది. మూడు గ్రామాల్లో బోర్లు నిర్మించి ఆ గ్రామాల్లోని 129 కుటుంబాలకు ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వడానికి అవసరమైన పైపు లైను నిర్మాణం పనులు చేపట్టింది. గ్రామీణ నీటి సరఫరా విభాగం పైపులైను నిర్మిస్తోంది. గతంలో ఆ మూడు గ్రామాల్లో తాగునీటి కోసం పలు సెంటర్లలో గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిన పంపుల ద్వారా తాగునీటి పట్టు కెళ్లేవారు. ప్రస్తుతం నిర్మిస్తున్న బోర్ల ద్వారా నీటిని ట్యాంక్‌లో ఎక్కించి పైపులైను ద్వారా ఇంటింటికీ కనెక్షన్ ఇచ్చి తాగునీటిని సరఫరా చేస్తామని గ్రామ కార్యదర్శి ఎస్.చెన్నకేశవరావు తెలిపారు.



సీతారామపురంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ కోసం ఏర్పాటు చేస్తున్న పైపులు

తాగునీటి సమస్యకు పరిష్కారం..



గ్రామంలో ముందెన్నడు లేని విధంగా శివారు గ్రామాలైన సీతారామపురం, వెంకటాపురం, అప్పారావుపేట గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం నిధులను ప్రణాళిక ప్రకారం మూడు గ్రామాల్లో తాగునీటి సరఫరాను మెరుగుపర్చుతాం.

–దేవగిరి సుజాత,గ్రామ సర్పంచి, పాతపాడు

ఇంటింటికీ కనెక్షన్ ఇస్తాం..



సీతారామపురం గ్రామంలో 60 వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంక్‌లో బోర్ల నీరు నిల్వ ఉంచి అక్కడ నుంచి శివారు గ్రామాలైన సీతారామపురం, వెంకటాపురం, అప్పారావు పేట గ్రామాల్లో తాగునీటిని ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ద్వారా ఇస్తాం. ప్రజల తాగునీటి అవసరాలు తీరతాయి.

–ఎస్.చెన్నకేశవరావు, గ్రామ కార్యదర్శి

నెల రోజుల్లో పనులు పూర్తి

సీతారామపురం, వెంకటాపురం, అప్పారావుపేట గ్రామాల్లో ఇంటింటికి కుళాయి కనెక్షన్‌కు సంబంధించి పైపులైను పనులు నెలరోజుల్లో పూర్తి చేయిస్తాం. ఒక గ్రామంలో పైపులైన్, ఇంటింటికీ కనెక్షన్ పనులు పూర్తిచేసిన తర్వాత మరో గ్రామంలో మొదలు పెడతాం. పైపులైను నిర్మాణం పనులు పూర్తి త్వరగా పూర్తిచేసి ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తాం.

– పి.శ్వేత, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

నేటి నుంచి సురక్ష వైద్య శిబిరాలు ప్రారంభం

గన్నవరం: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఈ. సత్యకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక బుద్దవరం రోడ్డులోని గ్రామసచివాలయం -2లో మంగళవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ఈ నెల 9న గొల్లనపల్లిలో, 19న బుద్దవరం-1 గ్రామ సచివాలయం, 23న చిన్న అవుటపల్లిలో సురక్ష శిబిరాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఫిబ్రవరి 2న కేసరపల్లి-1 సచివాలయంలో, 9న వీరపనేనిగూడెం-1లో, 20న గన్నవరం-1లో, 27న కొత్తగూడెంలో సురక్ష క్యాంప్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మిగిలిన గ్రామ సచివాలయాల పరిధిలో వారానికి ఒకటి చొప్పున నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వివరించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు.

నేడు పెంచిన పింఛన్ల నగదు పంపిణీ

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 2,750 నుంచి రూ.3 వేలకు పెంచిన పింఛన్ల నగదు పంపిణీ, కొత్త పింఛన్ల మంజూరు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, పింఛన్ లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు.

ఉంగుటూరు: మండలంలోని తరిగొప్పల గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జీ.శేషగిరిరావు తెలిపారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. సచివాలయం వద్ద ఉదయం 10 గంటల నుంచి వైద్య శిబిరంలో డాక్టర్లు అందుబాటులో ఉంటారని చెప్పారు. అందరికీ వైద్య పరీక్షలు చేసీ ఉచితంగా మందులు ఇస్తారని చెప్పారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తారని పేర్కొన్నారు.

ఘనంగా మరియమాత మాతృత్వ పండుగ

లక్ష్మీపురం(చల్లపల్లి): చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు శివరామదుర్గాపురంలోని ఆర్సీఎం చర్చిలో సోమవారం మరియమాత మాతృత్వ పండుగ ఘనంగా నిర్వహించారు. మచిలీపట్నం ఆర్సీఎం చర్చి ఫాదర్ జోజిబాబు, సాలిపేట చర్చి ఫాదర్ రెవరెండ్ ఎం.జోసఫ్, ఫాదర్ పి.బాలస్వామి దివ్య బలిపూజ, సత్ప్రసాద ఆరాధన నిర్వహించారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మరియదళ సభ్యులు భక్తి గీతాలు ఆలపించారు. చల్లపల్లి, ఘంటసాల మండలాల నుంచి 12 గ్రామాల విశ్వాసులు పాల్గొన్నారు.



దివ్య బలిపూజ నిర్వహిస్తున్న జోజిబాబు

వైభవంగా గొబ్బిళ్ల పేరంటం

చల్లపల్లి: ధనుర్మాసం సందర్భంగా సోమవారం స్థానిక గీతామందిరంలో సందె గొబ్బిళ్ల పేరంటం నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా శ్రీకృష్ణ పరమాత్మకు విశేష అలంకరణతో పూజలు చేశారు. తిరుప్పావై పాశుర విన్నపాలు సమర్పించారు. తీర్థగోష్ఠి నిర్వహించారు. కార్యక్రమంలోవరదా నాగమణి, కొల్లిపర నళిని, వేముల అనూష, సంఘ కార్యదర్శి వరదా హరిగోపాల్, పాల్గొన్నారు.

పరీక్షకేంద్రం పునరుద్ధరణ



కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్‌తో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టింగ్ అధికారి రవికుమార్

పెడన: పట్టణంలోని శ్రీ బొడ్డునాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు పరీక్షకేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు రీజినల్ ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసర్ పి.రవికుమార్ తెలిపారు. సోమవారం ఆయన కళాశాలను పరిశీలించి పరీక్ష కేంద్రాన్ని పునరుద్ధరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయకపోవడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం కావడమే కాకుండా ఉన్నతాధికారులకు విజ్ఞప్తులు, ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిపై విచారణ నిర్వహించి, పరీక్ష కేంద్రానికి తగ్గ సౌకార్యాలున్నదీ లేనిదీ పరిశీలించామని చెప్పారు. సౌకర్యాలు బాగానే ఉన్నాయని, అందువల్ల ఇక్కడ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు రవికుమార్ తెలిపారు. కృష్ణా జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి, కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ఆర్వీ ప్రసాద్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినందుకు రవికుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. కళాశాల లైబ్రరీ సైన్స్ అధ్యాపకులు పేరిశెట్టి నాగరవి, వరుదు నిరంజన్, వెంకన్న, గిరి, గంగాధర్, ఉదయభాస్కర్, శిరీష పాల్గొన్నారు.

కలెక్టర్, జేసీలకు శుభాకాంక్షలు తెలిపిన అధికారులు



కలెక్టర్ రాజాబాబు, సుజాతలతో కేక్ కట్ చేయిస్తున్న జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ పి.రాజాబాబు, జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్‌లను పలువురు ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు పుష్పగుచ్ఛాలు, మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ బంగ్లాలో తొలుత జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో పెద్ది రోజాలు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ దంపతులు రాజాబాబు, సుజాతలతో జిల్లా అధికారులు కేక్ కట్ చేయించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్, ఎంయూడీఏ చైర్‌పర్సన్ బొర్రా నాగదుర్గాభవాని, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు జన్ను రాఘవరావు, ఏఎస్పీ శ్రీహరి, ఆర్డీవోలు ఎం.వాణి, పి.పద్మావతి, దాసి రాజు, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీఈవో తాహెరాసుల్తానా, ట్రెజరీ డీడీ రవికుమార్, వ్యవసాయశాఖ అధికారి ఎన్.పద్మావతి, పరిశ్రమలశాఖ అధికారి ఆర్ వెంకట్రావు, టిడ్కో పీడీ చిన్నోడు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చంద్రలీల, మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ పీడీ ఎస్ సువర్ణ, డీఎంఅండ్‌హెచ్‌వో జి.గీతాబాయి, ఎంయూడీఏ వీసీ కె.రాజ్యలక్ష్మి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.సునీత, డీసీవో ఫణికుమార్, మార్కెటింగ్ ఏడీ నిత్యానందం, సమాచార పౌరసంబంధాలశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరప్రసాద్, అటవీశాఖ అధికారి చంద్రశేఖర్, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ సంతోష్‌కుమార్, కలెక్టరేట్ ఏవో ఏఎస్ఎన్ రాధిక తదితరులు ఉన్నారు.